క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవాలు



చందూర్ గేటు వద్ద ఉన్న ముఖద్వారానికి పూజలు నిర్వహించిన గ్రామస్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చందూర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయ ముఖ ద్వారానికి ఘనంగా తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. బుధవారం గ్రామంలోని రామలింగేశ్వర స్వామికి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం చందూర్ గ్రామ గేటు వద్ద నిర్మించిన ఆలయ ముఖ ద్వారానికి మాజీ ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వామివారి భజన మండలి సభ్యులతో కలిసి ప్రసాదం పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజ్‌కుమార్, మల్లారెడ్డి, కిష్టయ్య, నర్సింలు, యాదగిరి, నాగయ్య, రమేశ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాలు అందజేత



పరికరాలు అందిస్తున్న యాదగిరి

నిజాంపేట(మెదక్): మండల చెందిన విద్యార్థులకు ఏఎల్ఐఎమ్‌సీఓ సంస్థ వారు దివ్యాంగులైన విద్యార్థులకు ముందస్తుగా క్యాంపును నిర్వహించి, వారికి పరికరాలను మండల విద్యాధికారి యాదగిరి పంపిణీ చేశారు. ఈ మేరకు బుధవారం మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దివ్యాంగులకు పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు నరేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదర్శ పాఠశాల టాపర్ పూజ



పాపన్నపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన పూజ ఇంటర్‌లో టేక్మాల్ ప్రభుత్వ ఆదర్శ కాలేజీ టాపర్‌గా నిలిచారు. బైపీసి విభాగంలో 960 మార్కులు సాధించారు.

కొనసాగుతున్న ఉపాధిహామీ పనులు



టెంకటిలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందజేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం శివాయిపల్లి, చీలాపల్లి, మక్తలక్ష్మాపూర్, టెంకటి తదితర గ్రామాల్లో కొనసాగుతున్న ఫిష్‌పాండ్, ఫార్మేషన్ రోడ్డు పనులు ఆయన పరిశీలించారు. కూలీలకు కొలతలు, పనులపై వివరించాలని, వేసవిలో జాగ్రత్తలు పాటించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం మస్టర్లు, కూలీల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ రమేశ్ ఉన్నారు.

ఆటో డ్రైవర్ కూతురుకు రాష్ట్రస్థాయి ర్యాంకు



నారాయణఖేడ్: బైజాసాబాతో పాటు ఆమె తండ్రిని సన్మానించిన శ్రీనివాస్

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ ఎం.ఏ హకీం కూతురు బైజాసాబా ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో 990 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకును సాధించింది. బుధవారం పీసీసీ సభ్యులు కర్నెశ్రీనివాస్ సాబాతోపాటు ఆమె తండ్రిని శాలువాతో సన్మానించి అభినందించారు. గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సైతం బైజాసాబా రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి సత్తాచాటింది. ద్వితీయ సంవత్సరంలోనూ ప్రతిభ కనబర్చి ఈ ప్రాంతానికి మంచిపేరు తెచ్చిందని కొనియాడారు. మైనార్టీ నాయకులు అజీం, జుబేర్, ఫయాజ్ పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన ర్యాలీ



రామాయంపేటలో కొవ్వొత్తుల ప్రదర్శన



వెల్దుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ ..



చిలప్‌చెడ్‌లో బీజేపీ నాయకుల నిరసన

కాశ్మీర్‌లో మంగళవారం జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో నాయకులు, యువకులు కొవ్వొత్తులు పట్టుకొని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఉగ్రవాదుల చర్యకు మోదీ ప్రభుత్వం త్వరలోనే సమాధానం ఇస్తుందని అన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను హిందువులంతా ఏకమై ఖండించకపోతే భవిష్యత్‌లో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. దాడులకు పాల్పడిన ముష్కరులను బహిరంగంగా ఉరితీయాలన్నారు.



నర్సాపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు



తూప్రాన్‌లో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు



శివ్వంపేట(నర్సాపూర్): గూడూర్‌లో ..



చిన్నశంకరంపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



మనోహరాబాద్‌లో బీజేపీ నాయకుల నిరసన

నిరుపయోగంగా వేయింగ్ మిషన్

మార్కెట్ యార్డులో రూ. లక్షలు దుర్వినియోగం



వేయింగ్ మిషన్

రామాయంపేట(మెదక్): రైతుల సౌకర్యార్థం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వేయింగ్ మిషన్ (ఎలక్ట్రానిక్ తూకం యంత్రం) అలంకారప్రాయంగా మారింది. ఈయార్డు పరిధిలో రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట మండలాలున్నాయి. ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు తమ ధాన్యాన్ని యార్డులో విక్రయించే ముందు తూకం వేసుకోవడానికి దీనిని ఏర్పాటు చేశారు. కాగా యార్డులో ధాన్యం కొనుగోళ్లు జరుపకపోవడంతో కార్యాలయం ఆవరణలో రూ. లక్షలు ఖర్చుతో ఏర్పాటు చేసిన యంత్రం నిరుపయోగంగా ఉంది. దీనిని బిగించినప్పటి నుంచి ఇంతవరకు వినియోగించుకున్న దాఖలాలు లేవు. స్థానిక యార్డులో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోయినా, తూకం యంత్రాన్ని ఎందుకు బిగించారో ఎవరికీ అర్థం కావడంలేదు. వినియోగంలో లేకపోవడంతో ఈయంత్రం తుప్పు పట్టి పాడై పోయే అవకాశం ఉంది. ప్రతీ సీజన్‌లో యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ధాన్యం తరలించే లారీలు, ట్రాక్టర్లను యార్డులో కాకుండా ప్రైవేట్ కాంటాల వద్ద తూకం వేస్తుండటంతో రైతులపై అదనపు భారం పడటంతో పాటు యార్డుకు ఆదాయం సమకూరడంలేదు. ఈవిషయమై యార్డు కార్యదర్శి ఈశ్వర్‌కుమార్‌ను సంప్రదించగా, యార్డు పరిధిలో ఉన్న గోదాంలు పౌరసరఫరాల శాఖకు అద్దెకు ఇచ్చామని, వారు తూకం యంత్రాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు.

గోశాలలో పశుగ్రాసం దగ్ధం



గోశాలలో దగ్ధమవుతున్న పశుగ్రాసం

శివ్వంపేట(నర్సాపూర్): గోశాలలో నిల్వ ఉంచిన పశుగ్రాసం దగ్ధమైన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి ఆలయ పరిధిలో గోశాల నిర్వహణ చేస్తున్నారు. గోవుల కోసం గోశాల షెడ్డులో నిల్వ ఉంచిన ఎండు పశుగ్రాసానికి నిప్పంటుకోవడంతో స్థానికులు నర్సాపూర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసినప్పటికీ అప్పటికే అందులోని ఎండు పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైంది. సాయంత్రం గోవులను మేత కోసం తీసుకెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డు వెనుక భాగం నుంచి పశుగ్రాసంకు నిప్పు పెట్టారని గోశాల నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనలో పశుగ్రాసంతో పాటు షెడ్డు అగ్నికి ఆహుతి అయిందని వాపోయారు.

న్యాయం చేయాలి



తన భూమిలో పాతిన కడీని చూపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని మహిళా రైతు వేడుకుంది. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామానికి ఉప్పునూతన మీనాకు అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయంలో సర్వేనంబర్ 143లో సాగుకోసం మూడు ఎకరాల పరంపోగు భూమి ఇచ్చి పట్టా సర్టిఫికెట్ ఇచ్చారని చెప్పారు. అందులో కొంత భూమిలో ఈత చెట్లు పెట్టడంతో పాటు మరికొంత భూమి సాగు చేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నన్నారు. గ్రామానికి చెందిన వ్యక్తి తన భూమిలో దౌర్జనంగా కడీలు పాతాడని అన్నారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ సంబరంగా పాఠశాల వార్షికోత్సవం



పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కుర్తివాడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాత్రి వార్షికోత్సవం సంబరంగా జరిగింది. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ, బోనాల పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి, హెచ్‌ఎం మేఘ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు, టీచర్లు జనార్ధన్, శ్రీనివాస్, మల్లేశం, లావణ్య, స్వప్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ పాపన్నపేట ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు



పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఉన్నత పాఠశాలలో బుధవారం సీసీ కెమెరాలు బిగించారు. పీఎంశ్రీ నిధులతో కొనుగోలు చేసిన కెమెరాలు నాలుగు చోట్ల బిగించినట్లు హెచ్‌ఎం మహేశ్వర్ తెలిపారు.

◆ వక్ఫ్ భూములు కాపాడాలి

నర్సాపూర్: నర్సాపూర్‌లో ఉన్న వక్ఫ్ భూములు ఆక్రమణల పాలవుతున్నాయని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ హబీబ్‌ఖాన్ ఆరోపించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. పట్టణంలో పలు సర్వే నంబర్లలో వక్ఫ్ భూములు ఉన్నాయని, నర్సాపూర్‌కు చెందిన కొందరు వ్యక్తులు తమకు ఎలాంటి హక్కులు లేకపోయినా.. వాటిని ఆక్రమిస్తూ అమ్ముతున్నారని, పలువురికి లీజ్‌కు ఇస్తున్నారని చెప్పారు. ఆయా శాఖల అధికారులు స్పందించి, భూములు కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అసైన్డ్ భూముల్లో తవ్వకాలు

నర్సాపూర్: మున్సిపాలిటీలోని ఒకటవ వార్డు హన్మంతాపూర్ చెరువు పక్కన ఉన్న అసైన్డ్ భూముల నుంచి అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. రెండు రోజులుగా అసైన్డ్ భూముల నుంచి మట్టిని తవ్వి తరలిస్తున్నా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మట్టి వ్యాపారులు అసైన్డ్ భూములు, శిఖం భూముల్లో మట్టిని తవ్వి తరలించడం పరిపాటిగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులకు చెప్పినా.. ప్రయోజనం లేదన్నారు. ఈ విషయమై ఆర్ఐ ఫైజల్‌ను వివరణ కోరగా.. తన దృష్టికి రాలేదన్నారు. తాను పరిశీలించి, మట్టి తవ్వకాలు జరిపితే తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి



మృతిచెందిన పాడిగేదె

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి చెందిన సంఘటన మండల కేంద్రం శివ్వంపేటలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముద్దగాళ్ల లక్ష్మయ్య పాడి గేదెలతో జీవనోపాధి పొందుతున్నాడు. రోజువారిగానే తన పశువులను మేతకోసం సమీప వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లగా.. మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై మృతి చెందింది. పాడిగేదె విలువ 70 వేలు ఉంటుందని బాధిత రైతు లక్ష్మయ్య తెలిపారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు అవసరం

ఏంఈఓ సత్యనారాయణ రెడ్డి

దుబ్బాకటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు కూడా రాణించాలని రాయపోల్ మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం రాయపోల్ మండలం రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలంటే, ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజు వ్యాయామం చేయాలని సూచించారు. వాలీబాల్స్ అందజేసిన ఫౌండేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్కే హైదర్ పటేల్, ఉపాధ్యక్షుడు విజయరేఖ, సభ్యుడు గోవర్ధన్ రెడ్డి, నవీన్, నరేష్ కుమార్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, పీఈటీ అనీఫ్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న కళా ప్రదర్శన

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు సాగింది. డప్పు చప్పుళ్ల, కళాకారుల నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

ఎంఈఓ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

తూప్రాన్: వేసవిలో విద్యార్థులపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. బుధవారం పాఠశాల హెచ్‌ఎం పట్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆరుబయట కేవలం ఉదయం సాయంత్రం ఆడుకోవాలన్నారు. విద్యార్థులకు ఆట–పాటలతో పాటు వారికి ఆసక్తి కలిగిన విషయాలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. కాగా వార్షిక పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చిన ప్రతీ తరగతి విద్యార్థులకు మొదటి, రెండో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సెలవుల్లో పిల్లలు జాగ్రత్త

కొడిపల్లి(నర్సాపూర్): పాఠశాలకు వేసవి సెలవులు వచ్చాయని పిల్లలను ఇంటి వద్ద జాగ్రత్తగా చూసుకోవాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రం కొడిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించగా, ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సెలవుల్లో పిల్లలు ఎండలో తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలన్నారు. చెరువు కుంటల వైపు వెళ్లనివ్వొద్దన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల వాట్సాప్‌గ్రూపులు ఏర్పాటు చేశారని సెలవుల్లో వాట్సాప్ ద్వారా బోధించే విద్యబోధనను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సెలవుల్లో సైతం ఇంటి వద్ద చదువుకునేలా చూడాలన్నారు. పాఠశాల ప్రారంభం కాగానే విద్యార్థులను బడికి పంపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఓంప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెదక్ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ సురేఖ బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల నుంచి ప్రయాణికులు అడిగిన సమస్యలకు సమాధానాలు చెప్పారు. మెదక్ నుంచి కొడపాక జోగిపేట్ సంగారెడ్డి సర్వీస్ ఏర్పాటు చేయాలని, అలాగే దంతెపల్లి నుంచి కామారెడ్డి సర్వీసు, మెదక్ నుంచి పెద్ద శంకరంపేట్ సర్వీస్, మెదక్ డిపో నుంచి గుండారం కామారెడ్డి బస్ నడిపించాలని ప్రయాణికులు డీఎంను కోరారు. ఈ ప్రపోజల్స్ అన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లమన్నారు. ఈ సమస్యలన్నీ పరిశీలించి పరిష్కారం దిశగా ముందుకెళ్తామని తెలిపారు.

బాల్యవివాహాలపై అవగాహన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎస్ఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించిన వారికి తగిన శిక్షలు ఉంటాయని మండల పరిధిలోని చిట్కుల్ కేజీబీవీ ప్రత్యేకాధికారి అంజలి అన్నారు. బుధవారం ఆమె కేజీబీవీలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ముందుగా బాల్య వివాహాలు చేస్తే, జరిగే అనర్థాలపై విద్యార్థులతో నాటిక ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్ఎస్‌సీ పూర్తయిన విద్యార్థుల కోర్సుల ఎంపిక విషయంలో, వేసవి సెలవుల్లో విద్యార్థులు చేయాల్సిన కార్యక్రమాలపై, మొబైల్ ఫోన్ వినియోగం, సైబర్ మోసగాళ్ల నేరాలు తదితర వాటిపై తల్లితండ్రులకు అవగాహన కల్పించామన్నారు. మార్కులతో సంబంధం లేకుండా చదువు విషయంలో పిల్లలను ఎప్పటికప్పుడు ప్రోత్సాహించాలన్నారు. ముఖ్యంగా హాస్టల్‌లో ఉన్న పద్ధతుల గురించి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న రామోజిపల్లి గ్రామస్తులు

పెద్దశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండలం రామోజిపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని, ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ మర్చిపోయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు రమేశ్, మానిక్‌రెడ్డి, దత్తు, సురేశ్‌గౌడ్, సుభాష్, విఠల్‌గౌడ్, యాదుల్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహనతో న్యాయం



మాట్లాడుతున్న ప్యానెల్ మెంబర్ కరుణాకర్

చిన్నశంకరంపేట(మెదక్): చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే న్యాయం పొందడంతో పాటు తమ హక్కులను సంరక్షించుకోగలరని న్యాయసేవా అధికార సంస్థ సభ్యుడు కరుణాకర్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎఫ్ఐఆర్, భూ చట్టం, వ్యవసాయ భూ సమస్యలు పరిష్కారం, ప్రామిసరి నోట్, ఒప్పంద పత్రం, విక్రయ ఒప్పందంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖి కేంద్రం అధికారి రేణుక, షీ టీమ్ అధికారి గంగమణి మహిళల సంరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్, సిద్ధిరాములు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తొనిగండ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సహకార చైర్మన్ చంద్రం

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్ల, లక్ష్మాపూర్ గ్రామాల్లో బుధవారం స్థానిక సహకార సంఘం చైర్మన్ చంద్రం, పీఏసీ కార్యదర్శి సుప్రభాతరావు, మాజీ ఎంపీటీసీ నాగులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. రైతులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ ప్రాథమిక సహకార సంఘంలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి సీఈవో సాయిలు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇందులో ఏఈఓ మంజుల, పాక్స్ డైరెక్టర్ కిషన్, సిబ్బంది వేణుగోపాల్, కుమ్మరి సాయిలు, నాయకులు నాయికోటి భాస్కర్, చింతరవి, గోవింద్ చారి, తలారి రాములు, దుర్గయ్య, నర్సింలు, శ్రీరాములు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాటం



ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పోరాడుతుందని నార్సింగి మండల కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజాగౌడ్ అన్నారు. బుధవారం నార్సింగి మండలంలోని శంఖాపూర్ గ్రామంలో జైబాపు, జైబీమ్, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం మార్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేశవులు, రాజేందర్‌రెడ్డి, రాజేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.